సాక్షి జనగామ

బుధవారం | 7 | ఆగస్టు | 2024



'ఓపెన్'.. ఓ వరం

చదువును మధ్యలో మానేసిన వారికి తెలంగాణ స్టేట్ ఓపెన్ స్కూల్ సొసైటీ ఓ వరంలా మారింది.

- 8లో▸



ఎన్‌సీసీతో క్రమశిక్షణ, దేశభక్తి

ఎన్‌సీసీతో క్రమశిక్షణ, దేశభక్తి పెంపొందు తుందని క్యాంపు కమాండింగ్ అధికారి రామదురై అన్నారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
26^0 / 23^0

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. మధ్యాహ్నం ఎండ మామూలుగా ఉంటుంది. రాత్రి చల్లగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

'స్వచ్ఛదనం-పచ్చదనం'తో ఆరోగ్యం



పాలకుర్తి: అన్ని గ్రామాల్లో స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో అందరూ ఆరోగ్యంగా ఉంటారని డీఆర్‌డీఏ పీడీ మొగులప్ప అన్నారు. మంగళవారం పాలకుర్తి మండలం బమ్మెర గ్రామంలో మంచి నీటి ట్యాంకును శుభ్రపరిచే కార్యక్రమంలో పాల్గొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లోని మంచి నీటి ట్యాంకును శుభ్రపరిచే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాములు, సూపరింటెండెంట్ రవీందర్, కార్యదర్శి యుగేందర్, ఉద్యోగులు పాల్గొన్నారు

సమస్యల పరిష్కారంలో ముందంజ



దేవరుప్పుల: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో పీఆర్‌టీయూటీఎస్ ముందంజలో ఉందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కొల్ల మహిపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని మాధాపురం, కోలుకొండ తదితర పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల హక్కులు, సమస్యల పరిష్కారంలో సంఘం ముందువరుసలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ఎల్లారెడ్డి, అంబటి అంజయ్య, బీకోజి, గోలి తిరుపతిరెడ్డి, కిరణ్ కుమార్, విజయపాల్ రెడ్డి, బలనర్సయ్య, వెంకన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ గ్రామంలో పొలంబాట



జనగామ: వ్యవసాయ క్షేత్రాల వద్ద విద్యుత్ సరఫరా, నాణ్యతను నిర్ధారించుకునేందుకు ప్రతీ గ్రామంలో ఎన్‌పీడీసీఎల్ ఆధ్వర్యంలో పొలం బాట కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలని టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కె.వరుణ్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశం హాల్‌లో ఆపరేషన్, ఎంఆర్‌టీ, కమర్షియల్ అంశాలపై సమీక్ష నిర్వహించారు. నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు ప్రతిఒక్కరూ అంకిత భావంతో పని చేయాలన్నారు. పేపర్ ద్వారా సేవలను తగ్గించి, ఈ-స్టోర్‌ల ద్వారా పనులు చేయాలన్నారు. వచ్చే ఏడాదిలో అన్ని సబ్‌స్టేషన్‌ల పరిధిలో ఆటోమేటిక్ సేవలు అందుబాటులోకి రానున్నట్లు స్పష్టం చేశారు. ప్రతి డీటీఆర్‌కు ఏబీ స్విచ్‌లను ఏర్పాటు చేయాలని, తదితర వాటికి సంబంధించి అలర్ట్‌గా ఉండాలన్నారు. ఆయన వెంట ఎస్‌ఈ వేణుమాధవ్, అధికారులు ఉన్నారు.

దాడికి నిరసనగా రాస్తారోకో



జనగామ: న్యాయవాద దంపతులు అమృత రావు, కవితపై పోలీసుల దాడిని నిరసిస్తూ మంగళవారం సిద్దిపేట ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. బార్ అసోసియేషన్ చైర్మన్ ఎనగందుల చంద్రరుషి ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించి.. రోడ్డెక్కారు. ఈ సందర్భంగా చంద్రరుణి మాట్లాడుతూ సీఐ రఘుపతిరెడ్డి న్యాయవాదు దంపతులపై దాడి చేయడం దారుణమని, దీనిని బార్ అసోసియేషన్ తీవ్రంగా పరిగణిస్తున్నామన్నారు. ఇందుకు బాధ్యులైన సీఐ, ఎస్సై, కానిస్టేబుళ్లపై కేసు నమోదు చేసి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. చర్యలు తీసుకునే వరకు కోర్టు విధులు బహిష్కరిస్తామని హెచ్చరించారు. ఏసీపీ పార్థసారథి అక్కడకు చేరుకుని న్యాయవాదులతో మాట్లాడి నచ్చచెప్పడంతో శాంతించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి నక్క సిద్దులు, సీనియర్ న్యాయవాదులు శ్రీరాం శ్రీనివాస్, కె.రవీందర్‌రెడ్డి, నాగరాజశర్మ, మనోహర్‌రెడ్డి, పానుగంటి శ్రీనివాస్ ఉన్నారు.

సమగ్ర విచారణ జరిపిస్తాం : వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్

సివిల్ కేసు విషయంలో జనగామ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన ఇద్దరు న్యాయవాదులపై పోలీసులు దురుసుగా ప్రవర్తించారన్న న్యాయవాదుల ఫిర్యాదుపై వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్ స్పందించారు. ఈ మేరకు మంగళవారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. జరిగిన సంఘటనపై సమగ్ర విచారణ చేపడుతామని తెలిపారు. బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

దర్రీస్.. దర్జా!

ఆకట్టుకునే జంపఖానాలకు కేరాఫ్ వరంగల్

నేడు జాతీయ చేనేత దినోత్సవం

వరంగల్ కొత్తవాడ దర్రీస్.. పూర్తిగా చేతితో నేసిన వస్త్రాలు. దేశంలోని చేతి వృత్తుల్లో ఇది ఒకటిగా గుర్తింపు పొందింది. పెరిగిన సాంకేతికత.. పవర్‌లూమ్‌లు వచ్చినప్పటికీ సంప్రదాయ మగ్గాలపైనే ఈ దర్రీస్ (జంపఖానాలు) మొత్తాన్ని తయారు చేయడం దీని ప్రత్యేకత. రేఖాగణిత నమూనా కలిగిన దర్రీస్‌కు వరంగల్ బ్రాండ్. అందులోనూ కలంకారీ దర్రీస్ మరికొంచెం ప్రత్యేకం. దర్రీస్‌పై వివిధ డిజైన్ల కలంకారీ ప్రింట్లు వేస్తారు. ఇవి చూడడానికి ఎంతో ఆకర్షణీయంగా, హుందాగా కనిపిస్తాయి. బుధవారం 'జాతీయ చేనేత దినోత్సవం' సందర్భంగా మన దర్రీస్‌పై 'సాక్షి' ప్రత్యేక కథనం. **- వరంగల్ డెస్క్**

- కొత్తవాడనుంచి విదేశాలకు ఎగుమతి
- ప్రత్యేక ఆకర్షణగా కలంకారీ బ్రాండ్
- శుభకార్యాల్లో రిటర్న్‌గిఫ్ట్‌లుగా దర్రీస్
- ఉపాధి పొందుతున్న చేనేత కార్మికులు



మగ్గాలపై దర్రీస్ నేస్తున్న ఆడెపు శ్రీనివాస్ దంపతులు

దర్రీస్ అంటే తెలుగులో జంపఖానాలు. వీటిని పూర్తిగా పిట్‌లూమ్‌పై నేస్తారు. ఇంటర్‌లాక్ డిజైన్ ఉంటుంది. మొదట ప్లేన్‌గా ఉండేది. ఆ తర్వాత రెండు నుంచి మనకు అవసరమైన రంగుల దారం వాడే వరకు మార్పు చెందింది. పూర్తిగా చేతితో నేసే డిజైన్. ఎవరైనా వినియోగదారుడు తనకు కావాల్సిన డిజైన్ చెబితే ఆ రంగులకు అనుగుణంగా నేసి ఇస్తారు. నక్షత్రం, పడవలు, చేపలు, వివిధ రకాల బొమ్మల్ని డిజైన్‌లో నేస్తారు. ఇది పూర్తిగా నూలుతో చేసే వస్త్రం. క్వాలిటీ కూడా బాగుంటుంది. ప్లేన్ దర్రీస్ నుంచి విద్యార్థుల వసతి గృహాలకు సరఫరా చేస్తుంటారు. ఇంటర్ లాక్ డిజైన్లను ఇంట్లో డెకరేషన్‌కు ఉపయోగిస్తారు.

మొఘలుల కాలం నుంచే అభిరుచి

వరంగల్‌లో దర్రీస్‌ను తయారు చేసే సంప్రదాయం మొఘల్ శకం నాటిదిగా చెప్పొచ్చు. మొఘల్ సైన్యం భారతదేశంలోని దక్కన్ ప్రాంతంలోని దక్షిణాన దిగినప్పుడు, కళాకారులు, కళాకారులతో కూడిన సైన్యం కార్పెట్లను తయారు చేయడం ప్రారంభించింది. స్థానిక ప్రజలు దాన్ని తమ భాగంగా అంగీకరించారు. సాధారణ ఆదాయం వస్తుండడం, వంద సంవత్సరాలకుపైగా ఒక తరం నుంచి మరొక తరానికి ఈ చేనేత పని మారుతూ వచ్చింది. కొత్తవాడకు చెందిన పిట్ట రాములు.. 11 ఏళ్ల వయస్సులోనే తన తండ్రి రాజేరు దగ్గర దర్రీస్ నేయడం నేర్చుకున్నాడు. తండ్రి నుంచి అనుభవం పొందినట్లు రాములు 'సాక్షి'కి తెలిపారు.

జీఐ ట్యాగ్..

వరంగల్ దర్రీస్ నేసే మగ్గాలకు 2018, మార్చిలో జియోగ్రాఫికల్ ఇండికేషన్ (జీఐ) ట్యాగ్ మంజూరైంది. ఒకసారి ఒక ఉత్పత్తికి జీఐ ట్యాగ్ కేటాయిస్తే, ఆ పేరు ఆ భౌగోళిక ప్రాంతానికి ప్రత్యేకంగా మారుతుంది. ఆ ప్రాంతం కాకుండా మరే చోట తయారు చేసినా ఉత్పత్తులకు వర్తించదు. జీఐ ట్యాగ్ ఉల్లంఘిస్తే చట్టప్రకారం శిక్షార్హులు.

కలంకారీ దర్రీస్..



కలంకారీ దర్రీస్ అంటే.. పూర్తిగా కాటన్‌తో ప్లేన్‌గా నేసిన దర్రీస్‌పై కళంకారీ పెయింటింగ్ వేస్తారు. డైస్ (అద్దకం)కు నీటి ప్రవాహం అవసరం. ఇందుకోసం ప్లేన్ దర్రీస్‌ను మచిలీపట్నంలోని పెడనకు పంపిస్తారు. అక్కడున్న వారు కూరగాయల డైస్ వాడతారు. డిజైన్, రంగులను బట్టి అన్నిసార్లు ప్రవాహం ఉన్న నీటిలోనుంచి జాడించి తీయాలి. అక్కడ పెయింటింగ్ అయిన తర్వాత ఇక్కడికి పంపిస్తారు. వీటిని ట్రాన్స్‌పోర్ట్ చేసి ఇతర ప్రాంతాలకు పంపిస్తారు. ఈసాంకేతికత వచ్చి సుమారు 35 సంవత్సరాలు అయ్యింది.

రిటర్న్ గిఫ్ట్‌లుగా..



చేనేత అభిమానులు దర్రీస్‌ను వివిధ శుభకార్యాల్లో అతిథులకు రిటర్న్ గిఫ్ట్‌లుగా ఇస్తున్నారు. గతంలో ఉమ్మడి వరంగల్ కలెక్టర్‌గా ఆమ్రపాలి ఉన్న సమయంలో అంతర్జాతీయ కైట్ ఫెస్టివల్ నిర్వహించారు. ఆ కార్యక్రమంలో పాల్గొన్న వారికి ఓరుగల్లు ఆర్చ్‌ను నేయించిన దర్రీస్‌ను అధికారులకు అందజేశారు.

- ప్రశాంత్‌జీవన్ పాటిల్ కలెక్టర్‌గా ఉన్న సమయంలో కాళేశ్వరం ప్రాజెక్టును చూసేందుకు అన్ని జిల్లాల కలెక్టర్లు వచ్చారు. వారందరికీ వరంగల్ గుర్తింపుగా 4X6 కలంకారీ దర్రీస్‌ను కానుకగా అందజేశారు.
- శారీ ఫంక్షన్లు, ఇతర శుభకార్యాల్లో రిటర్న్ గిఫ్ట్‌లుగా డోర్ మ్యాట్లు, ఒకింత డబ్బు ఉన్న వారైతే కలంకారీ పీస్‌లను అందజేస్తున్నారు.

అంతర్జాతీయ.. జాతీయ ప్రదర్శనలు..



ఇటీవల రష్యాలోని భారత రాయబార కార్యాలయంలో వరంగల్ కలంకారీ దర్రీస్‌ను ప్రదర్శనకు పెట్టారు.

- లండన్ మ్యూజియంలో మన దర్రీస్ ఉన్నాయి.
- 1992 తర్వాత మలేషియా, సింగపూర్, ఆస్ట్రేలియాలో ప్రదర్శనకు పెట్టారు.
- 2019లో ఐక్యరాజ్య సమితి ముందు పిట్ట రాములు దర్రీస్‌ను ప్రదర్శించారు.
- పిట్ట రాములు ఉత్తర ఐరోపాకు చెందిన బాల్టిక్ ప్రాంతంలోని హిస్టోనియా దేశానికి కలంకారీ దర్రీస్ సరఫరా చేస్తుంటారు.
- ఢిల్లీ, బాంబే, కలకత్తా, హైదరాబాద్, భోపాల్ వంటి నగరాల్లో ఎగ్జిబిషన్లలో దర్రీస్, కలంకారీ దర్రీస్ వస్త్రాలు ఎగ్జిబిట్లలో ఉంచుతున్నారు.





ఎగ్జిబిషన్ల రూపంలో వెళ్తున్నాయి..



ఇది వరకు ఇతర దేశాల్లోనూ కస్టమర్లు ఉండేవారు. ఇప్పుడేంటంటే.. ఎగ్జిబిషన్ల రూపంలో ఇక్కడి నుంచి అక్కడికి దర్రీస్ పోతున్నాయి. ఈకామర్స్ బిజినెస్ పెరిగిపోయేసరికి ఆర్డర్లు రావడం తగ్గింది. అమెజాన్ వంటి ఈకామర్స్‌లో ఉన్నా.. నేరుగా మార్కెటింగ్ సౌకర్యం పెంచాల్సిన అవసరం ఉంది.

- చిప్పా వెంకటేశ్వర్లు, కొత్తవాడ చేనేత కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు

కళను నమ్ముకుని బతుకుతున్నాం..



మేం ఏళ్లుగా ఇదే కళను నమ్ముకుని బతుకుతున్నాం. మా తండ్రినుంచి నేను తీసుకున్నా. వృత్తి పని తప్ప మాకు వేరే పని రాదు. దర్రీస్ పని చేస్తేనే డబ్బులొస్తాయి. పెద్దగా గిట్టుబాటయ్యేదంటూ ఏమీ ఉండదు. కూడబెట్టేదంటూ ఏమీ ఉండదు. 35 ఏళ్లనుంచి చేస్తున్న. సొంతిల్లు కూడా లేదు.

- ఆడెపు శ్రీనివాస్, కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డు గ్రహీత

పెద్దగా ఆదాయం ఉండదు..



పూర్తిగా మగ్గంపై చేతితో నేస్తాం. ఇందులో ఎలాంటి రంగుల అద్దకం ఉండదు. వివిధ డిజైన్ల మేరకు దారాన్ని ఇంటర్‌లాక్ చేసి నేయాల్సి ఉంటుంది. ఇంటి గడప దగ్గర వేసే (డోర్ మ్యాట్) దర్రీస్ ఒకటి నేయాలంటే 45 నిమిషాలు పడుతుంది. ఇక.. 3/6 అంటే చాలా సమయం పడుతుంది. డబ్బులు పెద్దగా రావు. కానీ మాకు వచ్చిన పనే ఇది.

- మేరుగు ప్రసాద్, దర్రీస్ నేత కార్మికుడు

జయశంకర్ సార్ సేవలు చిరస్మరణీయం

- ఆయన జీవితం యువతకు ఆదర్శం
- కలెక్టర్ రిజ్వాన్ బాషా



జయశంకర్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్: తెలంగాణ రాష్ట్ర సాధనకు తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప వ్యక్తి ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ అని, ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు పింకేష్ కుమార్, రోహిత్ సింగ్‌లతో కలిసి కలెక్టర్ రిజ్వాన్ బాషా జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనకు తొలి, మలి దశ ఉద్యమంలో ఆయన పాత్ర కీలకమన్నారు. సార్ జీవితం యువతకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో జనగామ ఆర్డీఓ కొమురయ్య, అధికారులు పాల్గొన్నారు.


వివిధ పార్టీల ప్రతినిధులతో సమీక్ష

ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాకు చెందిన భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ (ఈవీఎం)లపై ఎలాంటి కేసులు లేనందున, ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రిలీజ్ చేయడం జరిగిందని ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని మినీ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు పింకేష్ కుమార్, రోహిత్ సింగ్‌లతో కలిసి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి బి. భాస్కర్, బీఆర్‌ఎస్ పార్టీ ప్రతినిధి ఆర్. రవి, భాజాపా పార్టీ ప్రతినిధి విజయ్ భాస్కర్, బీఎస్పీ పార్టీ ప్రతినిధి ఎం. చంద్రశేఖర్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు కిష్టయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

దేవరుప్పుల: దేవరుప్పుల మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం తహసీల్దార్ హుస్సేన్ ఆధ్వర్యంలో జయశంకర్‌సార్ జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఈఓ రాము ముఖ్యఅతిథిగా హాజరై జయశంకర్ చిత్ర పటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, నవీన్ కుమార్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే పచ్చదనం

- అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్



జనగామ రూరల్: క్లోరినేషన్ పనులను పరిశీలిస్తున్న జెడ్పీసీఈఓ సరిత

జనగామ రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం పచ్చదనం అభివృద్ధి పనుల్లో ప్రజల భాగస్వాములుగా చేయాలని అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని 22 వార్డులో తాగునీటి ట్యాంక్‌ను శుభ్రం చేసే విధానాన్ని పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. అలాగే గ్రామాల్లో చేపడుతున్న స్వచ్ఛదనం పచ్చదనం పనులు ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని జెడ్పీ సీఈఓ సరిత అన్నారు. మంగళవారం మండలంలోని పెంబర్తి, ఎల్లంల, శామీర్‌పేట గ్రామాల్లో చేపడుతున్న పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సంపత్‌కుమార్, భిక్షపతి, అనిల్, రాజు, మహేందర్ తదితరులు పాల్గొన్నారు

మొక్కలు నాటి సంరక్షించాలి

స్టేషన్‌ఘన్‌పూర్: కాలుష్య నివారణకు మొక్కలు పెంచడమే సరైన మార్గమని స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీమ్‌శర్మ అన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో ఘన్‌పూర్ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల ఆవరణలో మంగళవారం మొక్కలు నాటారు. ప్రతిఒక్కరూ తమవంతుగా ఐదు మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీఐ జి.వేణు, ఎస్ఐ వినయ్‌కుమార్, ప్రిన్సిపాల్ కె. కృతమూర్తి, పీడీ శ్రీనివాస్, రవీందర్, జయేందర్, లక్ష్మణ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దివ్యాంగుల ప్రత్యేక శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

జనగామ రూరల్: తెలంగాణ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఏర్పాటు చేయనున్న ప్రత్యేక గుర్తింపు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఈఓ కె.రాము మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనగామలోని భవిత సెంటర్‌లో నేడు (బుధవారం) ఉంటుందని, వైద్యులు పరీక్షించి అవసరమైన వారికి ఉపకరణాల అందజేస్తారన్నారు. శిబిరానికి హాజరయ్యే దివ్యాంగులు ఆధార్, ఇన్‌కం, సదరం సర్టిఫికెట్ జిరాక్స్‌తో పాటు రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో హాజరు కావాలన్నారు. పూర్తి వివరాలకు జిల్లా కోఆర్డినేటర్ నరసింహారావు (98851 59906) ను సంప్రదించవచ్చన్నారు.

మరో 15 రోజులే..

డెడ్ స్టోరేజీకి చీటకోడూరు రిజర్వాయర్

- 0.3 టీఎంసీల కెపాసిటీ.. 0.1కు పడిపోయింది
- నీటిని విడుదల చేయకుంటే... తాగునీటికి ఇబ్బందులే..
- ఇరిగేషన్ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష



చీటకోడూరు రిజర్వాయర్

జనగామ: రెండు దశాబ్దాలుగా జనగామ పట్టణ ప్రజలకు ప్రతిరోజు తాగునీటిని అందిస్తున్న చీటకోడూరు రిజర్వాయర్ మొట్ట మొదటిసారి గా అడుగంటి పోతుంది. వర్షాభావ పరిస్థితులకు తోడు.. ఎగువ ప్రాంతంలోని రిజర్వాయర్లలో నీటి నిల్వలు పడిపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఇటీవల కురిసిన వర్షాలతో గోదావరి జలకళను సంతరించుకున్నా... రిజర్వాయర్లు మోడుబారి కనిపిస్తున్నాయి. 0.3 టీఎంసీల సామర్థ్యం కలిగిన చీటకోడూరు డ్యాంలో ప్రస్తుత నీటి నిల్వలు 0.1కి పడిపోయాయి. మరో 15 రోజుల్లో చీటకోడూరు రిజర్వాయర్‌కు నీటిని తరలించకుంటే.. పట్టణానికి రెండు రోజులకోసారి నీటి సరఫరా తప్పదు.

జనగామ పట్టణం మున్సిపల్ పరిధిలోని 30 వార్డులకు చీటకోడూరు డ్యాం (ఫిల్టర్ బెడ్) నుంచి ప్రతీ రోజు తాగునీటి సరఫరా చేస్తారు. రోజువారీగా 9.2 లక్షల లీటర్ల (9.2 ఎంఎల్‌డీ) తాగునీటిని అందిస్తున్నారు. ఇందుకు డ్యాం మధ్యలో ఇన్‌లెట్ లెవల్ ఇన్‌టెక్‌పై రా వాటర్ పంపింగ్ కోసం మూడు ఫుడ్‌బాల్స్(మోటార్లు)ను ఏర్పాటు చేశారు. ఇక్కడ నుంచి ఫిల్టర్ బెడ్‌కు పైపులైన్ ద్వారా నీటిని పంపింగ్ చేసి.. శుద్ధి చేసిన తర్వాత పట్టణానికి సరఫరా చేస్తారు. రిజర్వాయర్‌లో 0.1 టీఎంసీకి నీటి నిల్వలు తగ్గుముఖం పట్టి డెడ్ స్టోరేజీకి పడి పోవడంతో తాగునీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తే పరిస్థితి నెలకొంది. మూడు ఫుడ్‌బాల్స్‌లో రెండింటిని కంటిన్యూగా నడిపిస్తారు. నీటి నిల్వలు తగ్గిపోవడంతో ఒక ఫుడ్‌బాల్ పైకి తేలగా.. రెండవది సిద్ధంగా ఉంది.

9.2 లక్షల లీటర్ల తాగునీరు సరఫరా

పట్టణంలో 11,500 వరకు నల్లా కనెక్షన్లు ఉంటాయి. చీటకోడూరు ఫిల్టర్ బెడ్ నుంచి రోజువారీగా 9.2 లక్షల లీటర్ల తాగునీటిని సరఫరా చేస్తుండగా, ఇందులో లక్ష లీటర్ల వరకు మిషన్ భగీరథ నుంచి తీసుకుంటున్నారు. డ్యాంలో ప్రస్తుత స్టోరేజీ 15 రోజుల వరకు సరిపోనుండగా... రెండవ ఫుడ్ బాల్ పైకి తేలితే... నీటి సరఫరా ఒక్కసారిగా నిలిచిపోనుంది.

అశ్వరావుపల్లి నుంచి నీటి తరలింపు

ఆర్ఎస్ ఘన్‌పూర్ రిజర్వాయర్ నుంచి అశ్వరావుపల్లి డ్యాంకు నీటిని తరలిస్తున్నాం. అశ్వరావుపల్లిలో నీటిమట్టం పెరిగిన వెంటనే చీటకోడూరు రిజర్వాయర్‌కు మళ్లిస్తాం. ప్రస్తుతం జనగామ పట్టణానికి నీటి ఎద్దడి రాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. చీటకోడూరు రిజర్వాయర్‌లో ప్రస్తుతం 60 రోజులకు సరిపడా నీరు ఉన్నప్పటికీ, మున్సిపల్ పంపింగ్ లెవల్‌ను పరిశీలిస్తే...20 రోజుల వరకు ఇబ్బంది ఉండదు.

- సుధీర్, ఇరిగేషన్ ఎస్ఈ జనగామ

తాగునీటి కొరత రావొద్దు: ఎమ్మెల్యే పల్లా

చీటకోడూరు డ్యాంలో నీటి నిల్వలు తగ్గుముఖం పడుతున్న సమయంలో పట్టణ ప్రజలకు తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్, ఇరిగేషన్ ఈఈ కమలాకర్, డీఈ రవి కుమార్, మున్సిపల్ చెర్‌పర్సన్ పోకల జమునతో కలిసి ఎమ్మెల్యే మంగళవారం రిజర్వాయర్‌ను పరిశీలించారు. ప్రస్తుతం డ్యాంలో నీటి నిల్వలు డెడ్‌స్టోరేజీకి వెళ్లడంతో మురికిగా మారిపోతున్నాయని, రా వాటర్‌ను పంపింగ్ చేసే మూడు మోటార్లలో ఒకటి పైకి తేలిందన్నారు. ఇలాగే ఉంటే తాగునీటి సరఫరా నిలిచి పోయే ప్రమాదం ఉందన్నారు. దేవాదుల ద్వారా ధర్మసాగర్ రిజర్వాయర్‌కు నీటిని మళ్లించి, అక్కడి నుంచి ఆర్ఎస్ ఘన్‌పూర్, అశ్వరావుపల్లి డ్యాం మీదుగా 14 కిలో మీటర్ల మేర ఉన్న కెనాల్ ద్వారా చీటకోడూరుకు రిజర్వాయర్‌కు తరలించాలని అధికారులను ఆదేశించారు.



రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పల్లా, అధికారులు

ఇరిగేషన్ ఎస్ఈ సుధీర్, దేవాదుల ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడిన ఎమ్మెల్యే కెనాల్‌లో పెరిగిన పిచ్చి మొక్కలను సైతం తొలగించి నీటిని విడుదల చేయాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు తాళ్ల సురేష్‌రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గాడిపెల్లి ప్రేమలతారెడ్డి, కో ఆప్షన్ సభ్యులు మసిఉర్ రెహమాన్, విష్ణువర్ధన్‌రెడ్డి, ముస్త్యాల దయాకర్, జూకంటి శ్రీశైలం, ఉల్లెంగుల సందీప్, నీల యాదగిరి, పురపాలిక కమిషనర్ వెంకటేశ్వర్లు, ఏఈ మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

32వసారి రక్తదానం



జనగామ: సిద్దిపేట జిల్లా కేంద్రంలో వాతపు రామలక్ష్మి అనే మహిళకు అత్యవసరంగా రెండు యూనిట్ల రక్తం అవసరమవడంతో అమ్మ ఫౌండేషన్ టీం సభ్యులు ఎర్రం శివ, కొమరవెల్లి విశ్వనాథ్ ఇద్దరు యువకులు రక్తదానం చేసి తమలోని మానవత్వాన్ని చాటుకున్నారు. అయితే ఆ యువకులు ఇప్పటికీ 32వ సారి రక్తదానం చేశారు. అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్, సలహాదారులు వంగ భీమ్ రాజు వారికి ధన్యవాదాలు తెలిపారు.

ప్రింటెడ్ చీరల తయారీని నిషేధించాలి



ప్రింటెడ్ చీరను దహనం చేస్తున్న కార్మికులు

జనగామ: చేనేత ఇక్కత్ పట్టుచీరలను పోలే విధంగా ప్రింటెడ్ చీరల తయారీని నిషేధించాలని కోరుతూ జిల్లా కేంద్రంలో మంగళవారం చేనేత కార్మికులు మహా ర్యాలీ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి తరలి వచ్చిన వందలాది మంది నేతన్నలతో రెల్వేస్టేషన్ నుంచి ఆర్టీసీ చౌరస్తా మీదుగా కలెక్టరేట్ వరకు చేనేత పరిరక్షణ ర్యాలీతో తమ నిరసన గళాన్ని వినిపించారు. ఆర్టీసీ చౌరస్తాలో ప్రింటెడ్ చీరను దహనం చేసి, పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ రిజ్వాన్ బాషాకు అందించారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత చింతకింది మల్లేశం, భారతి సొసైటీ అధ్యక్షుడు గుర్రం నాగరాజు, వేముల బాలరాజు మా ట్లాడుతూ ప్రాచీన కాలానికి చెందిన చేనేత కలను కనుమరుగు చేసే కుట్రలు జరుగుతున్నాయన్నారు. సూరత్, గుజరాత్, తదితర రాష్ట్రాల్లోని పలు కంపెనీలు పోచంపల్లి ఇక్కత్ చీరలను పోలే విధంగా ప్రింట్ చేస్తూ కార్మికులకు జీవనోపాధి లేకుండా చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో చేనేత నాయకులు మచ్చ బాల నరసయ్య, ఎనగందుల కృష్ణ, బొంతపల్లి నాగరాజు, అంకం తిరుమలేష్, కోడం శ్రీనివాస్, బిర్రు నరేష్, ఏల శ్రీనివాస్, ఇస్తారు నగేష్, బేతి వెంకటేశ్వర్లు, వంగ యుగంధర్, చిత్రాల గణేష్, కాముని సమ్మయ్య, శివకుమార్, వెంకటేష్, శ్రీను, గణేష్, తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

రీజినల్ కోఆర్డినేటర్‌గా రమేశ్‌లాల్



న్యూశాయంపేట: తెలంగాణ మైనారిటీ గురుకుల విద్యాసంస్థలు ములుగు, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్‌గా రమేశ్‌లాల్ హట్కర్‌ను నియమిస్తూ టెమ్రిస్ కార్యదర్శి ఆయేషా మస్రత్ ఖానమ్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం బాలుర-1 మైనారిటీ గురుకులం ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయనను హనుమకొండ జిల్లా పరకాల మైనారిటీ బాలుర-1 గురుకులం ప్రిన్సిపాల్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు పరకాల ప్రిన్సిపాల్ బాధ్యతలు నిర్వహిస్తున్న ఏ. రవిని భూపాలపల్లి జిల్లా భూపాలపల్లి బాలుర-1 గురుకులానికి బదిలీ చేశారు. రమేశ్‌లాల్ హట్కర్ పరకాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తూనే ములుగు, భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాల పరిధిలోని గురుకులాల సమన్వయ అధికారిగా బాధ్యతలు నిర్వర్తించాలని కార్యదర్శి ఆదేశించారు. కాగా, ఆర్ఎల్‌సీగా బాధ్యతలు చేపట్టిన రమేశ్‌లాల్ హట్కర్‌కు ఆయా జిల్లాల ప్రిన్సిపాళ్లు శుభాకాంక్షలు తెలిపారు.

డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్ష ఫీజు చెల్లించాలి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ కోర్సుల బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ తదితర కోర్సుల్లో ఆరో సెమిస్టర్ పరీక్షల ఫలితాలు ఇటీవల విడుదల చేసిన విషయం విదితమే. అయితే ఒక్క సబ్జెక్టులో థియరీలో ఫెయిలైన విద్యార్థుల కోసం డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్షను ఈనెల 17న నిర్వహించనున్నారు. వారి కోసం పరీక్ష ఫీజు చెల్లించేందుకు ఈనెల 12న చివరి గడువు అని పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ తిరుమలాదేవి తెలిపారు.

ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలి

- టీఎస్‌ఈఈయూ సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్

హన్మకొండ: విద్యుత్ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని, కాలయాపన చేస్తే పోరుబాట పడుతామని తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో టీజీ జెన్‌కో, టీజీ ట్రాన్స్‌కో సీఎండీ రొనాల్డ్ రోస్, టీజీ ఎస్పీడీసీఎల్ సీఎండీ ముష్రాఫ్ అలీ ఫారూఖీని స్వయంగా కలిసి, హనుమకొండలోని ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డికి మెయిల్ ద్వారా టీఎస్‌ఈఈయూ-327 సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్, రాష్ట్ర నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్, ఎన్పీడీసీఎల్ కంపెనీ అధ్యక్షుడు పి.మహేందర్ రెడ్డి మాట్లాడుతూ మూడేళ్లకు పైగా ఎలాంటి పదోన్నతులు కల్పించకపోవడంతో విద్యుత్ ఉద్యోగులు నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ఇచ్చిన హామీకి విరుద్ధంగా పదోన్నతులను పక్కన పెట్టి సాధారణ బదిలీలకు మార్గదర్శకాలు జారీ చేయాలని యాజమాన్యాలు ఆలోచిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఉద్యోగుల పదోన్నతులకు ప్రాధాన్యం ఇవ్వాలని, లేని పక్షంలో విద్యుత్ కార్యాలయాల ఎదుట ధర్నా చేపడుతామని, అవసరమైతే మెరుపు సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు.





'ఓపెన్'.. ఓ వరం

చదువు మధ్యలో మానేసిన వారికి సదావకాశం

- ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో అడ్మిషన్ల ప్రక్రియ
- ఈనెల 8 నుంచి దరఖాస్తుల ఆహ్వానం
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 105 అధ్యయన కేంద్రాలు


అభ్యాసకులకు తరగతులు..

ఓపెన్ స్కూల్ టెన్త్‌లో ఈ విద్యాసంవత్సరంలో ప్రవేశాలు పొందేవారికి ఎంపిక చేసుకున్న అధ్యయన కేంద్రాల్లో కాంటాక్ట్ తరగతులకు హాజరుకావాల్సింటుంది. వీరికి రెండో శనివారం, ఆదివారం సెలవు దినాల్లో తరగతులు కొనసాగిస్తారు. పుస్తకాలు కూడా అందజేస్తారు.



ఓపెన్‌స్కూల్ తరగతులకు హాజరైన అభ్యాసకులకు బోధన చేస్తున్న అధ్యాపకులు(ఫైల్)

జిల్లాల వారీగా అధ్యయన కేంద్రాలు



విద్యారణ్యపురి/ కాళోజీ సెంటర్ : కొందరికి చదువుపై ఆసక్తి ఉంటుంది. కానీ పలు కారణాలు, కుటుంబ పరిస్థితులతో పాఠశాల స్థాయిలోనే చదువు మధ్యలో నిలిపివేస్తుంటారు. మరికొందరు టెన్త్ పూర్తియ్యాక కూడా ఇంటర్ విద్యకు వెళ్లకుండా చదువు మానేస్తుంటారు. కుటుంబ ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ఏదో ఓ పనిలోనే నిమగ్నమవుతుంటారు. ఈ క్రమంలో మళ్లీ చదువుకోవాలనే ఆసక్తి ఉన్న వారికి తెలంగాణ స్టేట్ ఓపెన్ స్కూల్ సొసైటీ (టాస్) సదావకాశం కల్పిస్తోంది. సార్వత్రిక విద్యను దూర విద్య విధానంలో అందిస్తోంది. ఈ ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలకు ఉమ్మడి వరంగల్ జిల్లాలో హనుమకొండ, వరంగల్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, జనగామ, మహబూబాబాద్‌లో కలిపి మొత్తం 105 అధ్యయన కేంద్రాలున్నాయి. 2008-2009 విద్యాసంవత్సరంలో ఓపెన్ స్కూల్‌టెన్త్‌లో ప్రవేశాలు మొదలుపెట్టారు. 2010-2011నుంచి ఓపెన్ స్కూల్ విధానంలో ఇంటర్‌లోనూ ప్రవేశాలు అందుబాటులోకి వచ్చాయి. ఫలితంగా ప్రతి ఏడాది వేలాదిమంది ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రవేశాలు పొంది తమ చదువు పూర్తిచేసుకుంటున్నారు.

గత అడ్మిషన్లు ఇలా

విద్యాసంవత్సరం	టెన్త్	ఇంటర్
2021-2022	3,337	4041
2022-2023	2644	4346
2023-2024	2,773	4,245

దరఖాస్తులు ఇలా చేసుకోవాలి..

- ఓపెన్‌స్కూల్ విద్యావిధానంలో టెన్త్‌లో ప్రవేశాలకు ఎలాంటి విద్యార్హతలేదు. కనీస వయసు 15 ఏళ్లు. ఆపై వయసు గలవారు కూడా దరఖాస్తులు చేసుకోవచ్చు.
- తహసీల్దార్ లేదా మున్సిపల్ అధికారులు జారీ చేసిన బర్త్ సర్టిఫికెట్ ఉండాలి.
- పాఠశాల స్థాయిలో చదువు మానిస్తే ట్రాన్స్‌ఫర్ (టీసీ) సర్టిఫికెట్, ఆధార్ కార్డుతో ప్రవేశం పొందొచ్చు.
- ఇంటర్‌లో ప్రవేశాలు పొందువారే తప్పనిసరిగా టెన్త్ ఉత్తీర్ణత కలిగి ఉండాల్సింటుంది.
- ఈనెల 8నుంచి ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ఈ విద్యాసంవత్సరం 2024-2025లో ప్రవేశాలకు ఎలాంటి అపరాధ రసుములేకుండా ఈ ఏడాది ఆగస్టు 8 నుంచి సెప్టెంబర్ 10వరకు అడ్మిషన్లు పొందొచ్చు.
- అపరాధ రుసుముతో సెప్టెంబర్ 11నుంచి అక్టోబర్ 3వ తేదీవరకు దరఖాస్తులు చేసుకునే అవకాశం కల్పించారు.
- టెన్త్‌లో ప్రవేశాలకు ఫీజు ఓసీ అభ్యాసకులు రూ. 1550, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభ్యాసకులు రూ. 1150 చెల్లించాల్సింటుంది.
- ఇంటర్మీడియట్‌లో అడ్మిషన్లకు ఓసీలు రూ. 1800, ఎస్సీ, ఎస్టీ , బీసీ, మైనార్టీ అభ్యాసకులు రూ. 1500 చెల్లించాల్సింటుంది.
- టీజీ ఆన్‌లైన్‌లో మీసేవ కేంద్రాల ద్వారా లేదా ఏపీ ఆన్‌లైన్ ద్వారా ఫీజులు చెల్లించి తమకు సమీపంలోని ఓపెన్ స్కూల్ అధ్యయన కేంద్రాల్లో దరఖాస్తులతోపాటు సమర్పించాల్సింటుంది. అడ్మిషన్లు తీసుకోవాల్సింటుంది.

రెగ్యులర్ విద్యతో సమాన గుర్తింపు



ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్‌లో అడ్మిషన్‌లు ఈనెల 8 నుంచి ప్రారంభమవుతున్నాయి. ఈ విద్యకు రెగ్యులర్‌తో సమాన గుర్తింపు ఉంది. ఓపెన్ స్కూల్‌లో టెన్త్ పూర్తిచేసినవారు ఆపై విద్యకు, ఇంటర్ పూర్తిచేసినవారు ఉన్నతవిద్యకు కూడా అర్హులే . ప్రభుత్వరంగంలో చిరు ఉద్యోగాలు చేసుకునేవారికి పదోన్నతులకు కూడా అవకాశం ఉంటుంది. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.తెలంగాణఓపెన్ స్కూల్.ఓఆర్‌జీ వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలు అందుబాటు ఉంటాయి.

\- మురాల శంకర్‌రావు, ఓపెన్ స్కూల్ ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్

సమర్థవంతమైన విధులకు పట్టం..

- డీజీపీ చేతుల మీదుగా ప్రశంసపత్రాలు అందుకున్న పోలీస్ అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు



డీజీపీ చేతుల మీదుగా ప్రశంసపత్రాలు అందుకుంటున్న ఇన్‌స్పెక్టర్ రవికుమార్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ సత్యనారాయణరెడ్డి

వరంగల్ క్రైం : వివిధ హత్య కేసుల్లో నిందితులకు జీవిత ఖైదు శిక్ష పడడానికి కృషి చేసిన ఇద్దరు ఇన్‌స్పెక్టర్లతో పాటు గతంలో వరంగల్‌లో పనిచేసిన ఏసీపీ, ఎస్సైలకు డీజీపీ జితేందర్ చేతుల మీదుగా ప్రశంసపత్రాలు అందజేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర పోలీస్ ప్రధాన కార్యాలయంలో డీజీపీ జితేందర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ హత్య కేసుల్లో నిందితులకు జీవిత ఖైదు శిక్ష పడడంలో కేసు దర్యాప్తు అధికారిగా ప్రతిభ కనబర్చిన పోలీసు అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ప్రశంస పత్రాలు అందుకున్నారు. ఇందులో భాగంగా 2020లో హసన్‌పర్తి పీఎస్ పరిధిలో జరిగిన హత్య కేసులో అప్పటి ఇన్‌స్పెక్టర్, ప్రస్తుతం సీసీఆర్‌బీగా పనిచేస్తున్న శ్రీధర్ రావు, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజమల్లారెడ్డి, అలాగే, మడికొండ పీఎస్ పరిధిలో 2021లో జరిగిన హత్య కేసులో అప్పటి ఇన్‌స్పెక్టర్, ప్రస్తుతం మామునూర్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ సత్యనారాయణరెడ్డి, చెన్నారావుపేట పీఎస్ పరిధిలో 2016లో జరిగిన హత్య కేసులో అప్పటి నర్సంపేట ఏసీపీ, ప్రస్తుతం అడిషనల్ ఎస్పీ బోనాల కిషన్, అప్పటి చెన్నారావుపేట ఎస్సై జగదీశ్‌తో పాటు పబ్లిక్ ప్రాసిక్యూటర్ మర్రి వాసుదేవరెడ్డికి డీజీపీ ప్రశంసపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రశంసపత్రాలు అందుకున్న పోలీస్ అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లను వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అభినందించారు.

ప్రొఫెసర్ జయశంకర్ మహనీయుడు



మాట్లాడుతున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి

- టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి

హన్మకొండ : తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ అని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండ నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా జయశంకర్ చిత్రపటానికి సీఎండీ వరుణ్ రెడ్డి, డైరెక్టర్లు, అధికారులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సీఎండీ మాట్లాడుతూ తెలంగాణకు జరుగుతున్న అన్యాయం, అసమానతలకు వ్యతిరేకంగా జయశంకర్ పోరాటం చేశారన్నారు. నాన్ ముల్కీ ఉద్యమం, సాంబార్-ఇడ్లీ గోబ్యాక్ ఉద్యమంలో పాల్గొన్నారని, తెలంగాణ వాదాన్ని జాతీ య, అంతర్జాతీయ సదస్సుల్లో వినిపించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్లు బి.అశోక్ కుమార్, టి.సదర్ లాల్, టి.మధుసూదన్, సీజీఎంలు కె.తిరుమల్ రావు, రాజుచౌహాన్, కె.కిషన్, రవీంద్రనాథ్, జాయింట్ సెక్రటరీ కె.రమేశ్, జీఎంలు మాధవరావు, దేవేందర్, గిరిధర్, నాగప్రసాద్, శేషారావు, వేణుబాబు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగం అత్యుత్తమమైనది

- అంతర్రాష్ట్ర మండలిని పునరుద్ధరించాలి
- మల్టీమీడియా ఇండిపెండెంట్ సీనియర్ జర్నలిస్ట్ ఎస్.వెంకటనారాయణ



మాట్లాడుతున్న సీనియర్ జర్నలిస్ట్ వెంకటనారాయణ

కేయూ క్యాంపస్ : ప్రపంచంలోనే భారత రాజ్యాంగం అత్యుత్తమమైందని మల్టీమీడియా ఇండిపెండెంట్ సీనియర్ జర్నలిస్ట్ ఎస్.వెంకటనారాయణ అన్నారు. మంగళవారం కేయూ రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి అధ్యక్షతన విశ్వవిద్యాలయ సెనెట్ హాల్‌లో తెలంగాణ సిద్ధాంతకర్త జయశంకర్ మెమోరియల్ ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం జయశంకర్ 12వ ఎండోమెంట్ లెక్చర్ నిర్వహించారు. 'ఫెడరలిజం ఇన్ ఇండియా' అనే అంశంపై వెంకటనారాయణ స్మారక ఉపన్యాసం చేశారు. సమాఖ్య స్ఫూర్తియే స్వాతంత్య్రం వచ్చిన తరువాత 565 స్వదేశీ సంస్థానాల విలీనానికి బాట వేసిందన్నారు. అందులో నిజాంపాలనలో ఉన్న తెలంగాణ కూడా అన్నారు. ప్రాంతీయ అసమానతలు సరిదిద్దడం, ధనిక రాష్ట్రాలు, పేద రాష్ట్రాలకు సహకరించడం ఫెడరల్ స్ఫూర్తికి అవసరమన్నారు, అంతర్రాష్ట్ర మండలిని పునరుద్ధరించాల్సిన అవసరం ఉందన్నారు. కేయూ మాజీ వీసీ, జయశంకర్ ఫౌండేషన్ ట్రస్ట్ చైర్మన్ ఎన్.లింగమూర్తి మాట్లాడుతూ జయశంకర్ మానవతావాది, పాలన దక్షుడని కొనియాడారు. ఫౌండేషన్ ట్రస్ట్ సెక్రటరీ, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ మాట్లాడుతూ జయశంకర్ ఉపన్యాసాలను పుస్తక రూపంలో తీసుకొచ్చే యోచనలో ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ట్రస్ట్ వైస్ చైర్మన్ ఎ.శంకరయ్య, కేయూపాలక మండలి సభ్యులు బి.సురేశ్‌లాల్, బి.రమ, సుకుమారి, నవీన్, చిర్రరాజు, పుల్లూరి సుధాకర్, అనితారెడ్డి పాల్గొన్నారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్ వల్లాల పృథ్వీరాజ్ సంయోజకులుగా వ్యవహరించారు.

ప్రభుత్వ ఉద్యోగి కిడ్నాపర్ అవతారం..

- డబ్బుల కోసం బాలుడి అపహరణ
- పోలీసులకు సమాచారం
- గంటలోపే కథ సుఖాంతం
- నిందితుడి అరెస్ట్, రిమాండ్



బాలుడితో మాట్లాడుతున్న పోలీస్ ఇన్‌స్పెక్టర్ సంజీవ

హసన్‌పర్తి : రైల్వేలో విధులు నిర్వహిస్తున్న ఓ ఉద్యోగి కిడ్నాపర్ అవతారమెత్తాడు. బాలుడిని కిడ్నాప్ చేశాడు. అయితే సదరు ఉద్యోగిని పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. మహబూబాబాద్‌కు చెందిన ప్రియా, సురేశ్ దంపతుల కుమారుడు బొడ విట్టు పూరిగట్టు ప్రాంతంలో ఉంటున్న అమ్మమ్మ వినోద వద్ద ఉంటూ ఎల్‌కేజీ చదువుతున్నాడు. రోజూ ఇంటి నుంచి పాఠశాలకు వెళ్తుంటాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం పూరిగట్టు నుంచి ఓ వ్యక్తి 100 డయల్ చేసి బాలుడు కిడ్నాప్ అయినట్లు చెప్పారు. దీంతో స్థానిక పోలీస్ ఇన్‌స్పెక్టర్ సంజీవ, ఎస్సై రవీందర్ అప్రమత్తమయ్యారు. వెంటనే రంగంలోకి దిగి బాలుడి ఆచూకీ కనుగొన్నారు. ఫిల్టర్‌బెడ్ ఏరియాలో బాలుడు విట్టు, కిడ్నాపర్‌ను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం కిడ్నాపర్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా తన పేరు కార్నేయస్ అని, తనది పోలీస్ కాలనీ అని చెప్పాడు. తాను రైల్వే ఉద్యోగి అని పేర్కొన్నాడు. డబ్బుల కోసమే బాలుడిని అపహరించినట్లు విచారణలో అంగీకరించాడని ఇన్‌స్పెక్టర్ చెప్పారు. బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించి నిందితుడి అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు వివరించారు. ఈ సందర్భంగా చాకచక్యంగా వ్యవహరించి గంటలోపే కిడ్నాపర్‌ను పట్టుకోవడంలో ప్రతిభకనబరిచిన పోలీస్‌ఇన్‌స్పెక్టర్ సంజీవ, ఎస్సై రవీందర్, సిబ్బందిని సీపీ అభినందించారు.

యువతి ప్రాణం కాపాడిన డయల్ 100..

- ఆత్మహత్యకు పాల్పడాలని భావించగా రక్షించిన బ్లూ కోల్ట్స్ సిబ్బంది
- అభినందించిన ఏసీపీ



యువతిని కాపాడిన బ్లూ కోల్ట్స్ కానిస్టేబుళ్లు

రామన్నపేట : డయల్ 100 ఓ యువతి ప్రాణం కాపాడింది. తండ్రి మందలించాడనే కారణంతో ఇంటి నుంచి పారిపోయి వచ్చి పురుగుల మందు తాగి చనిపోతున్నానని తన మేనబావకు వీడియో కాల్ చేసి చెప్పింది. దీనిపై సదరు యువకుడు వెంటనే డయల్ 100కు కాల్ చేయడంతో అప్రమత్తమైన ఇంతేజార్ పోలీసులు..యువతిని కాపాడారు. ఇన్‌స్పెక్టర్ శివకుమార్ కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం తాళ్లపూసపల్లికి చెందిన రేపాక కీర్తన సోమవారం తన తండ్రి మందలించాడనే కారణంతో మనస్తాపానికి గురైంది. ఆత్మహత్య చేసుకుంటానని ఇంటి నుంచి వరంగల్ రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. తన మేనబావ వినయ్‌కి వీడియో కాల్ చేసి 'నేను చనిపోతున్నా.. నాకు బతకాలని లేదు' అని సమాచారం అందించింది. దీంతో వినయ్ వెంటనే 100 డయల్ చేసి సమాచారం అందించారు. దీంతో అప్రమత్తమైన ఇంతేజార్‌గంజ్ పీఎస్ బ్లూ కోల్ట్స్ సిబ్బంది రాజయ్య, శ్రీనివాసులు స్పందించారు. యువతి పురుగుల మందు డబ్బాతో రైల్వేస్టేషన్ ఎదుట ఉండడాన్ని గమనించారు. వెంటనే యువతి వద్దకు చేరుకుని మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. తండ్రి గిరిబాబు ప్రతిసారి మందలిస్తుండడంతో తనకు బతకాలని లేదని చెప్పగా యువతికి కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం తల్లిదండ్రులను పిలిపించి అప్పగించినట్లు సీఐ తెలిపారు. కాగా, డయల్ 100 కాల్‌కు వెంటనే స్పందించి యువతి ప్రాణం కాపాడిన బ్లూ కోల్ట్స్ కానిస్టేబుళ్లను ఏసీపీ నందిరాం నాయక్ అభినందించారు.

రూ.2.10 లక్షల విలువైన గంజాయి పట్టివేత

- రవాణాదారుడి అరెస్ట్.. పరారీలో మరో ఇద్దరు
- వివరాలు వెల్లడించిన మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ మల్లయ్య



గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్‌ను చూపుతున్న ఇన్‌స్పెక్టర్ మల్లయ్య

ఖిలా వరంగల్: వాహన తనిఖీల్లో పోలీసులు రూ.2.10 లక్షల విలువైన 8.400 కేజీల గంజాయిని పట్టుకున్నారు. ఈ మేరకు మంగళవారం వరంగల్ మిల్స్‌కాలనీ పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇన్‌స్పెక్టర్ మల్లయ్య వివరాలు వెల్లడించారు. వరంగల్ చింతల్ బ్రిడ్జి వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో మహారాష్ట్రలోని ముంబాయికి చెందిన ఇమ్రాన్ బాసిర్ సయ్యద్ అనుమానాస్పదంగా కనిపించాడు. వెంటనే అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా రూ.2.10లక్షల విలువైన 8.400 కేజీల ఎండు గంజాయి లభించింది. దీంతో స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. కాగా, పాత ముంబాయికి చెందిన అల్బాస్ బేగ్, ఒడిశాకు చెందిన ఎస్‌కే నసీమ్ మహమ్మద్ పరారీలో ఉన్నారని ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మల్లయ్య మాట్లాడుతూ గంజాయి క్రయవిక్రయాలపై ఉక్కుపాదం మోపుతామన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు స్టేట్ ఫైనాన్స్ కమిషన్ పర్యటన

హన్మకొండ అర్బన్ : రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్యులు బుధవారం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటిస్తారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీల ఆర్థిక స్థితిగతులను అంచనా వేస్తారు. అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఉమ్మడి జిల్లా పరిధిలోని అధికారులతో సమావేశం నిర్వహిస్తారు. ఇందుకు సంబంధించి జిల్లా అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

పొలం వద్దకు వెళ్తూ తిరిగిరాని లోకాలకు..

- కారు ఢీకొని రైతు మృతి
- మర్రిమిట్టలో ఘటన



వెంకన్న(ఫైల్)

గూడూరు: సైకిల్‌పై పొలం వద్దకు వెళ్తున్న ఓ రైతును గుర్తుతెలియని కారు వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో సదరు రైతు మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం మండలంలోని మర్రిమిట్ట ఎన్‌హెచ్‌పై జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ధనసరి వెంకన్న (45) ఉదయం ఇంటి నుంచి సైకిల్‌పై జాతీయ రహదారి పక్కన నుంచి వెళ్తున్నాడు. ఈ క్రమంలో గుర్తుతెలియని కారు వెనుక నుంచి వెంకన్న సైకిల్‌ను ఢీకొని ఆగకుండా వెళ్లింది. ఈ ప్రమాదంలో వెంకన్న తలకు తీవ్రగాయం కావడంతో గ్రామస్తులు వెంటనే నర్సంపేట ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తుండగా మృతిచెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సీహెచ్. నగేష్ తెలిపారు. మృతుడికి కూతురు, కుమారుడు ఉన్నారు.

అస్వస్థతతో రేషన్ డీలర్ మృతి..

గూడూరు మండలం జగన్నాయకులగూడేనికి చెందిన రేషన్ డీలర్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పెనక వీరయ్య (53) సోమవారం రాత్రి అస్వస్థతకు గురై మృతిచెందాడు. మృతుడికి భార్య, ఒక కూతురు, కుమారుడు ఉన్నారు.

హైదరాబాద్‌లో చంద్యా తండా వాసి మృతి



వాసు(ఫైల్)

కురవి : హైదరాబాద్‌లో కురవి మండలం తట్టుపల్లి శివారు చంద్యా తండాకు చెందిన మాలోత్‌వాసు(36) యాసిడ్ తాగి ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతి చెందాడు. తండావాసుల కథనం ప్రకారం.. వాసు రెండేళ్ల నుంచి హైదరాబాద్‌లోని ఘట్‌కేసర్‌లో డీసీఎం నడుపుకుంటూ జీవిస్తున్నాడు. ఫైనాన్స్‌లో డీసీఎం కొనుగోలు చేశాడు. అయితే కిస్తీలు చెల్లించకపోవడంతో ఫైనాన్స్ నిర్వాహకులు వాహనం తీసుకెళ్లారు. ఆర్థిక పరిస్థితి బాగాలేకపోవడం.. డీసీఎంను ఫైనాన్స్ నిర్వాహకులు తీసుకెళ్లడంతో మనస్తాపానికి గురైన వాసు.. గత నెల 29వ తేదీన యాసిడ్ తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబీకులు గమనించి నిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఈ ఘటనపై కుటుంబీకులు ఘట్‌కేసర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుడికి భార్య స్రవంతి, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

ఎన్‌సీసీతో క్రమశిక్షణ, దేశభక్తి

- క్యాంపు కమాండింగ్ అధికారి రామదురై
- కేయూలో 580 మంది ఎన్‌సీసీ కెడెట్స్‌కు శిక్షణ



మాట్లాడుతున్న ఎన్‌సీసీ కమాండింగ్ అధికారి రామదురై

కేయూ క్యాంపస్: ఎన్‌సీసీతో క్రమశిక్షణ, దేశభక్తి పెంపొందుతుందని క్యాంపు కమాండింగ్ అధికారి ఎస్ఎస్ రామదురై అన్నారు. తెలంగాణ బెటాలియన్ ఆధ్వర్యంలో వచ్చే ఏడాది జనవరి 26న ఢిల్లీలో జరగబోయే రిపబ్లిక్ డే (ఆర్‌డీసీ) పరేడ్‌కు ఎంపిక చేయడానికి మంగళవారం ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల కెడెట్స్ క్యాంపును కాకతీయ యూనివర్సిటీలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వాయిసేన జాతీయ క్యాంపునకు ఎంపికైన కెడెట్స్ కూడా ఈ క్యాంపులో పాల్గొంటున్నారన్నారు. ఈ క్యాంపు ఈనెల 14వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. వచ్చే ఏడాది ఢిల్లీలో జనవరి 26న జరిగే రిపబ్లిక్ పరేడ్‌కు ఈ క్యాంపు నుంచే ఎంపిక చేస్తామన్నారు. అనంతరం వీరికి హైదరాబాద్‌లో శిక్షణ ఇవ్వబోతున్నామన్నారు. 580 మంది ఎన్‌సీసీ కెడెట్స్‌కు శిక్షణ కొనసాగుతుందన్నారు. ఇందులో రోజూ యోగాసానాలు, మ్యాప్ రీడింగ్, క్రీడల శిక్షణ, ఆర్మీ ఆయుధాలపై శిక్షణ కొనసాగుతుందన్నారు. సమావేశంలో క్యాంపు డిప్యూటీ కమాండ్ అధికారి కెప్టెన్ డాక్టర్ సతీశ్, కెప్టెన్ డాక్టర్ ఎం.సదానందం, ఇతర ఆఫీసర్లు ప్రవీణ్, బాల్‌రెడ్డి, సందీప్‌కుమార్‌రెడ్డి, సౌరస్య, రఫీ, సూపరింటెండెంట్ అరుణకుమారస్వామి, సతీశ్, మహేశ్ పాల్గొన్నారు.

మద్యం మత్తులో పసికందును విక్రయించిన తండ్రి

- తల్లి ఒప్పందంతోనే అమ్మకం?
- ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రిలో ఘటన



జంపయ్య

ఏటూరునాగారం: నవమాసాలు మోసి తల్లి బిడ్డకు జన్మనిస్తే కన్నతండ్రి మద్యం మత్తులో బిడ్డను విక్రయించాడు. ఈ ఘటన ములుగు జిల్లా ఏటూరునాగారం సామాజిక ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. ములుగు జిల్లా వెంకటాపురం(కె) మండలానికి చెందిన జంపయ్య నిండు గర్భిణి అయిన తన భార్య లక్ష్మిని కొద్దిరోజుల క్రితం ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రిలో చేర్పించారు. లక్ష్మి పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఇప్పటికే ఇద్దరు కూతుళ్లు ఉండగా మూడో కాన్పులోనూ ఆడ శిశువు జన్మించింది. దీంతో మద్యానికి బానిసైన జంపయ్య వారం రోజులనుంచి బిడ్డను అమ్మడానికి ప్రయత్నం చేస్తున్నాడు. ఈ మేరకు రామన్నగూడెం గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో రూ.15వేలతోపాటు ద్విచక్రవాహనం ఒప్పందం చేసుకొని విక్రయించాడు. శిశువు విక్రయానికి భార్య లక్ష్మి కూడా ఒప్పుకున్నట్లు తెలిసింది. కాగా, లక్ష్మి బంధువులు జంపయ్యను గట్టిగా మందలించగా ఆ శిశువు మరణిస్తే ఖననం చేసినట్లు బుకాయించాడు. అనుమానం వచ్చిన బంధువులు లక్ష్మిపై ఒత్తిడి తేవడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేసింది. దీంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ విషయంపై జంపయ్యను నిలదీయగా రామన్నగూడెం గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి రూ. 15వేల నగదు, ద్విచక్రవాహనాన్ని తీసుకునేటట్లు ఒప్పందం కుదుర్చుకొని విక్రయించినట్లు చెప్పాడు. ఈ విషయంపై స్థానిక పోలీసులు ఐసీడీఎస్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో విచారణ కొనసాగుతుంది.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

RESTAURENT FOR SALE

- వరంగల్ ఖమ్మం మెయిన్ రోడ్డుకి వాగ్దేవి ఇంజనీరింగ్ కాలేజ్ ఎదురుగా గల బాలాజీ రెస్టారెంట్ ఫర్నీచర్‌తో సహా అమ్మబడును. సంప్ర।। 7396077320, 9440761222. [W-1239827]

FINANCE SERVICES

- సిరి అసోసియేట్స్: అన్ని రకాల రుణాలు, పర్సనల్, హౌసింగ్, మార్టిగేజ్, ఓపెన్ ప్లాట్స్‌పై కూడా సివిల్ ప్రాబ్లం ఉన్న చేయించబడును. సెల్: 9666142226. [W-1239823]

BUSINESS OFFER

- మీరు బైబ్యాక్ అగ్రిమెంట్‌తో లాభదాయకమైన లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబీ డైపర్ మెషిన్, ప్లాస్టిక్ ఉద్యోగ్ వ్యాపారాన్ని ప్రారంభించండి. (ప్రభుత్వ ఆమోదితము) 8376001873, 9643010487, 83760 89771, 011-25920179 [DA-5872]

WANTED

- మా ఆఫీస్‌లో పనిచేయుటకు స్త్రీలు అర్జెంటుగా కావలెను. అర్హత: 10th and above వివరాలకు వెంటనే సంప్రదించండి. సెల్: 7382323126. [W-1239829]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ।। అదనపు లైను 60/- రూ।। మాత్రమే 5% GST అదనము

- హన్మకొండ, వరంగల్ లోకల్‌లో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్, సూపర్‌వైజర్స్ అర్జెంటుగా కావలెను. జీతం:12000-15000. సెల్: 9000463426. [W-1264984]
- హాస్పిటల్ నందు పనిచేయుటకు అనుభవం ఉన్న PRO వెంటనే కావలెను. అడ్రస్: కాకాజీ కాలనీ, హన్మకొండ. సెల్: 9700295551, 8074585992. [WA-6516]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.